# అనన్తము – అన్తము

"ఆపః" శబ్దము తరువాత మనము విచారింపతలచినది, అనన్త శబ్దము గదా! అన్తము, అనన్తము – రెండు శబ్దములును ఒకదాని కొకటి దగ్గర కనుక రెండింటిని విచారింతము.

సంస్కృతమునందు "అన్తము" అనగా మధ్య, నడిమి అని ఒక అర్థము. చివర, అంచు (end) అని మరియొక అర్థము. అనన్తమనగా మధ్యగాని, చివరగాని లేనిది, విశాలమైనది, ఆకాశము అని అర్థము.

వేదమునందీ రెండు శబ్దములెట్లు వాడబడినవి?

"**అనన్తే అన్తః పరివీతి ఆగాచ్ఛుచిః**" –ఋగ్వేదసంహిత (4–1–7)

ఇది అగ్నిదేవుని పిలుచు మన్త్రము. అనన్తే = అనన్తములో ఉన్నటువంటి; అన్తః = అన్తమునందు; పరివీతి = కూర్చొని ఉన్న; శుచిః = శుచి సేయువాడా (అగ్నీ!); ఆగాత్ = రమ్ము.

సంస్కృతభాష, అన్తము లేనిది అనన్తము అని చెప్పుచుండగా, వేదము అనన్తములో అన్తమున్నదనుచున్నది. కనుక వేదభాష, సంస్కృతభాష ఒకటి కాదు; వేరువేరు.

అనన్తే అన్తః. ఈ అన్తము మధ్య కాదు; చివర కాదు. మరి ఏమిటి? వేదభాష అక్షరముల మీద నిర్మింపబడిన భాష. ఎందుకనగా, మానవుడు అక్షరజ్ఞానముతోడ పుట్టుచున్నాడు కనుక. వేదము మనము పుట్టుటకు ముందు మనయందే శక్తులున్నవో తెలియజేయు గ్రంథము గనుక.

అ–కారము మన శక్తి. మనతో వచ్చినదియే గాక, మనమింతవరకు సంపాదించినదికూడ కలసిన శక్తి. న–కారము మనకు ప్రస్తుతమున్న జ్ఞానము. దీనిలో గూడ మనవెంట వచ్చినది, మనమీ జన్మలో నింతవరకు సంపాదించినది కలసి ఉన్నది. తకారము చోటును కల్పించుకొనుట. అన్తమనగా మనకున్న శక్తి, జ్ఞానములతో ఇంక కొంచెము "నిలువనీడ" – అనగా సుస్థితి కల్పించుకొనుటకు ఊహించుట.

మనలో ఊహలు ఎందుకు పుట్టుచున్నవి? మనము మరి కొంచెము బాగుపడవలెనను ఇచ్ఛ వలననే కదా! అన్తము అకార, నకారములు కలియుచోటు. మన యందు ఊహలు పుట్టుచోటు.

"అనన్తము" నందు అన్తమునకు మరియొకసారి అ–కార, న–కారములు చేర్చబడినవి. మరియొక ఊహ కలుగుటకు వీలు సూచించుచున్నది. అన్త యనగా "ఇంకను", ఒకటిని మించి, అని అర్థము. వేదమీ "అన" శబ్దమును ఈ యర్థములో తరచు ఉపయోగించును. సంస్కృతభాషలో గూడ "అన" అనిన అవ్యయమునకు యీ అర్థముగూడ

నున్నది. సంస్కృతము వేదభాషనుండి పుట్టినది గదా! అనన్తము అనగా అనేకములైన అన్తములున్న చోటు. ఊహలు పుట్టు తావులు అనేకములున్న ప్రదేశము. ఊహాలోకము.

అన్తము ఊహ పుట్టుచోటు; అనన్తము అట్టి చోటులనేకములున్నది అయినచో- దాని స్వరూపమేమిటి? "సృష్టి" లో ఏది అయినను ఉండు చోటు ఆకాశము గనుక, అనన్తము గూడ ఆకాశమే. కనుక అనన్తమనగా ఆకాశము. ఊహలు మనలో పుట్టుచున్నవి గనుక, అనన్తము మనలో ఉన్న ఆకాశము. వేదము దానిని "అన్తరిక్షము" అనును. సాయణుడు ఆయన భాష్యమునందు "అనన్తే" అనగా నభమునందు అని వ్రాసినాడు. ఆకాశమధ్యమందున్న అగ్ని అని ఆయన వ్యాఖ్యానము.

శుచి యనగా శోధించి, పరిశుద్ధము సేయువాడు. మన అనరిక్షమునంతటను వెదకి, అందు అపరిశుభ్రములు, అమంగళములైన, దీన దారిద్ర్య భావములను తీసివేసి, ధైర్యము కూడగట్టి, శాశ్వతములైన కార్యకర్తలకుండు భావములను కల్పించు వాడు శుచి. నేను ఇప్పుడు యజ్ఞము (పని) తలపెట్టినాను. ఆ యత్న భావనలోగాని, దానిని కొనసాగించుటలోగాని, ఏ విధమయిన అమంగళభావములు నాయందుద్భవింపకుండ చూచుట నీ విధి. అందుకొరకే నీవా అన్తము నందున్నది. ఇది యీ వేదమన్త్రభావము. ఇచ్చట మనము పిలుచుచున్న అగ్ని మనలో మనము పరిశుద్ధముగా నుండవలెనని ఇచ్ఛాశక్తియే. మన దైనందిన వ్యవహారములో, మన స్వలాభాపేక్షలో, ఇతరుల శ్రేయస్సును గుర్తింపక ప్రవర్తింతుము. ఆ ఫలితములు మనకు తెలుసును. మనము తలచిన దొకటి, జరిగినదొకటి. ఆ వేదమన్త్రము మనలను యీారంభమునందే మేలుకొలుపుచున్నది.

ఊహను కల్పించు శక్తి అగ్ని కావచ్చును కాని, మనము ఊహలయందు ఎందరో దేవతలను భావింతుము కదా! ఏ దేవతను అనన్తమునందూహించి పిలుతుమో, అప్పుడా దేవతను వేదము "అనన్తః" అనును. అప్పుడు అనన్తము నందున్నది కనుక.

**సమానో అధ్వా స్వస్రోః అనంతః** – ఋగ్వేదము (1–113–3)
ఇది ఉషో దేవతాహ్వాన మన్త్రము.

సమానః = ఒక్కటే అయినది; అధ్వా = దారి; స్వ స్రోః = భాగ్యవంతమయినట్టి;
అనంతః = అనంతమునందున్నది.

ఉషస్సు ప్రత్యేకమయిన దారి వెంబడి వచ్చునది. భాగ్యవంతమయినది. ఇప్పుడు నా భావనాకాశమున దీపించుచున్నది. అట్టి ఉషస్సునాహ్వానించు ఋక్కు.

వేదఋక్కులకు గాని, యజుస్సులకు గాని, సామలకు గాని, మొదళ్ళు, చివరలున్నవి. మన్త్రములందలి ప్రతి అక్షరము ఉత్కృష్టభావములతో (అన్తములతో) నిండి యుండుటవలన, ప్రతి మన్త్రమనంతము.

నాలుగు వేదములందును చివరి మన్త్రములున్నవి. కాని మనము చదువుట నారంభించగనే మన అంతరిక్షమునందు విస్ఫులింగములవలెఅన్తము లావిర్భవించును. మన భావనా వీధులను విస్తరింపజేయును. మన జీవితములకు వెలుగు దారులు కల్పించును. మన అన్తరిక్షము వేదభావములకు నిలయమగును. మన అనన్తమంతయు వ్యాపించుటచేత, మనకా వేదములు అనన్తములు. ఇదియే "**అనన్తా వై వేదాః**" అను వాక్యమున కర్థము.